# రెండోరోజూ అదే జోరు

## కేసీఆర్ బస్సుయాత్రకు జన నీరాజనం

**పల్లెపల్లెనా పూలవర్షం.. ఘన స్వాగతం • జననేత కోసం గంటల ఎదురుచూపులు**

**గులాబీవనమైన భువనగిరి పట్టణం • విజయవంతంగా సాగుతున్న యాత్ర**





### నిరుద్యోగ భృతి ఇస్తామనలేదని ప్రమాణం చేస్తరా?

- **బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): నిరుద్యోగ భృతి ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టలేదని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అసెంబ్లీ సాక్షిగా పేర్కొన్నారని, అది నిజమని సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణం చేయాలని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్ రెడ్డి సవాల్ విసిరారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరిగా లోక్‌సభ ఎన్నికల్లోనూ ప్రజలను మాయచేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఒక ప్రకటనలో మండిపడ్డారు. ప్రతి మహిళకు రూ.2,500, వృద్ధులకు రూ.4,000 పెన్షన్, రైతుభరోసా రూ.15వేలు, కౌలు రైతులకు రూ.12వేలు, యువతులకు స్కూటీలు, విద్యార్థులకు క్రెడిట్ కార్డులు ఇస్తా అని ఎందుకు ప్రమాణం చేస్తలెవ్.? అని సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీశారు. వంద రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పి, మాట తప్పావని, హామీలను ఫలానా తేదీలోగా పూర్తిచేస్తానని ఎందుకు దేవుళ్ల మీద ఒట్టు వేస్తలెవ్.? అని ప్రశ్నించారు. ఎగ్గొట్టేవాడే ఎక్కువగా ప్రమాణాలు చేస్తడని, అట్లనే రేవంత్‌రెడ్డి కూడా కచ్చితంగా ఎగ్గొడతాడు కాబట్టే, కనిపించిన ప్రతీ దేవుడి మీద ప్రమాణం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అడ్రస్ గల్లంతవుతుందని, రేవంత్‌రెడ్డి ముఖంలో, మాటల్లో ఫ్రస్టేషన్ కనిపిస్తున్నదని తెలిపారు. కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మడం లేదని, ఎలాగైనా నమ్మించాలని చీప్ ట్రిక్స్ ప్లే చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజలు తమను నమ్మడం లేదనే విషయాన్ని, తనకు తానే బయటపెట్టుకుంటున్నారన్నారు.

హైదరాబాద్/నల్లగొండ ప్రతినిధి, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ)/దేవరుప్పుల: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్రలో రెండో రోజూ అదే హోరు కొనసాగింది. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బుధవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ నుంచి మొదలై సూర్యాపేట వరకు సాగింది. రాత్రి అక్కడే బసచేశారు. యువత, గులాబీ శ్రేణులు పెద్దసంఖ్యలో అక్కడికి తరలిరావడంతో క్యాంప్ గులాబీతోటను తలపించింది. కేసీఆర్‌తో ఫొటోలు దిగేందుకు యువత పోటీపడ్డారు. ఉదయం నుంచి భువనగిరికి బయలుదేరేంత వరకు ఫొటోలు దిగడం విశేషం. కేసీఅర్ స్థానిక నేతలు, యువతను, మహిళా నేతలను పేరుపేరునా పలకరించడంతో సంబురపడ్డారు. గురువారం సాయంత్రం సూర్యాపేట నుంచి కేసీఆర్ బస్సు యాత్ర భువనగిరికి పయనమైంది. కేసీఆర్ బయటకు వస్తుంటే పెద్ద సంఖ్యలో అప్పటికే గుమికూడిన పార్టీ కార్యకర్తలు, అభిమానులు కేరింతలు కొట్టారు. కేసీఆర్ ప్రయాణిస్తున్న బస్సు బయటకు వస్తుంటే టాటా చెప్తూ వీడ్కోలు పలికారు. సూర్యాపేట దాటి కొద్దిదూరం రాగానే తిమ్మాపూర్ వద్ద పెద్దసంఖ్యలో ప్రజలు, పార్టీ శ్రేణులు గుమికూడారు. కేసీఆర్‌ను చూసి చేతులు ఊపుతూ స్వాగతం పలికారు. బస్సుపై పెద్ద ఎత్తున పూల వర్షం కురిపించారు. యువకులు పటాకులు కాలుస్తూ ఆనందం వ్యక్తం చేశారు. అర్వపల్లిలోనూ భారీ ఎత్తున ప్రజలు బస్సుకు ఎదురేగి పార్టీ జెండాలు చేతబట్టి పూలు చల్లారు. జై కేసీఆర్... జై కేసీఆర్ అంటూ నినాదాలు చేశారు. తిరుమలగిరిలోనూ పార్టీ కార్యకర్తలు, మహిళలు కేసీఆర్‌ను చూసేందుకు తరలి వచ్చారు. కేసీఆర్ బస్సును చూడగానే కేరింతలు కొడుతూ చేతులెత్తి జై కొట్టారు. కేసీఆర్ అన్ని చోట్లా బస్సులో నుంచే అభివాదం చేస్తూ, నమస్కరిస్తూ ముందుకు సాగారు.

#### దేవరుప్పులలో కేసీఆర్‌కు అపూర్వ స్వాగతం

జనగామ జిల్లా దేవరుప్పుల వద్ద బస్సు యాత్రకు మాజీ మంత్రి ఎర్రబెల్లితోపాటు వందలాది నాయకులు, కార్యకర్తలు కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికారు. పూల వర్షం కురిపించారు. దూరంగా ఫుట్‌పాత్‌పై నిలబడిన మాజీ మంత్రి ఎర్రబెల్లిని గమనించిన కేసీఆర్ నవ్వుతూ బస్సెక్కాలని సైగ చేశారు. బస్సెక్కిన ఎర్రబెల్లి కేసీఆర్ పక్కన కూర్చుని ప్రజలకు అభివాదం చేశారు. గంట వ్యవధిలో ఇంత మంది రావడంపై ఎర్రబెల్లిని కేసీఆర్ అభినందించినట్టు తెలిసింది. బస్సు యాత్ర జనగామ, ఆలేరు, మీదుగా భువనగిరికి చేరుకున్నది. మార్గమధ్యంలో ప్రతి పల్లెలోనూ కేసీఆర్ బస్సు యాత్రకు ప్రజల నుంచి మంచి స్పందన కనిపించింది. పూలు చల్లుతూ, పటాకులు పేల్చుతూ, ప్లకార్డులను ప్రదర్శిస్తూ నీరాజనం పలికాయి. చేతులు ఊపుతూ, బస్సు యాత్రను మొబైల్ ఫోన్లలో ఫొటోలు తీస్తూ ప్రజలు మురిసిపోయారు. రోడ్డుకు ఇరువైపులా నిలబడి జననేత కేసీఆర్‌కు జేజేలు పలికారు. బిల్డింగులపై నుంచి బస్సుయాత్రను ఫొటోలు తీసుకున్నారు.

#### జనసంద్రంగా భువనగిరి

తొలిరోజు మిర్యాలగూడ, సూర్యాపేటల్లో కిక్కిరిసిన జనంతో పోటీ పడేలా భువనగిరి పట్టణం కూడా జనసంద్రంగా మారింది. కేసీఆర్ రాక కోసం మధ్యాహ్నం నుంచే పార్టీ కార్యకర్తలు, అభిమానులు తరలి రావడం కనిపించింది. భువనగిరి పార్లమెంట్ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి కార్లు, ఆటోలు, బస్సులు, డీసీఎంల్లో వచ్చిన ప్రజలు సాయంత్రం 5 గంటల వరకే భువనగిరికి చేరుకున్నారు. సాయంత్రానికి ఎటు చూసినా గులాబీ దళమే కనిపించింది. భువనగిరికి నలువైపులా నుంచి తరలి వచ్చిన జనంతో భారీ సందడి నెలకొన్నది. కేసీఆర్ భువనగిరికి చేరుకొని కొద్దిసేపు వివేరా హోటల్‌లో టీ బ్రేక్ తీసుకున్నారు. సరిగ్గా ఏడుగంటలకు అక్కడి నుంచి బయలుదేరి భువనగిరి పట్టణంలోకి బస్సు యాత్ర ప్రవేశించింది. పట్టణ శివారు నుంచే ప్రజలు బస్సుయాత్రకు ఎదురేగి స్వాగతం పలికారు. రైల్వేస్టేషన్ మీదుగా పాత బస్టాండ్ నుంచి కేసీఆర్ రోడ్ షో మొదలైంది. డప్పుల నృత్యాలు, మహిళల బోనాలు, డోలు వాయిద్యాల నడుమ భారీ జన సందోహంతో రోడ్ షో కొనసాగింది. కిక్కిరిసిన జనాలతో అరగంటపాటు రోడ్ షోలో కేసీఆర్ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. రోడ్ షోలో పెద్దఎత్తున యువత చేసిన నినాదాలతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లింది. వినాయక చౌరస్తాలో ప్రజలను ఉద్దేశించి కేసీఆర్ ప్రసంగించారు.

#### పంచులు... నిలదీతలు...

కేసీఆర్ బస్సులో నుంచి పైకి వస్తుంటే ఈలలు, కేరింతలు, చప్పట్లతో సభా ప్రాంతం దద్దరిల్లిపోయింది. అభిమాన నేతను చూస్తూ సీఎం సీఎం అని నినదించారు. దీనితో కేసీఆర్ వాళ్లను సమూదాయించాల్సి వచ్చింది. కేసీఆర్ ప్రసంగం బీజేపీపై పంచులతో మొదలైంది. పదేండ్ల బీజేపీ పాలనలో దేశానికి ఏమైనా లాభం జరిగిందా అని కేసీఆర్‌ఆర్ ప్రసంగం మొదలుపెట్టగా లేదు.. లేదు.. అంటూ ప్రజలు స్పందించారు. ఒకరేమో దేవుని పేరుతో ఓట్లు అడుగుతున్నారని.. ఇంకొకరేమో దేవుళ్లపై ఒట్లు వేస్తూ ఓట్లు అడుగుతున్నారని పంచులు విసరగా జనం చప్పట్లతో స్పందించారు. కాషాయపు ఎజెండా కడుపు నింపుతదా, పొలాలకు నీళ్లు తెస్తదా ప్రజలు ఆలోచించాలని కోరగా తేదు.. తేదు.. అని సమాధానం వచ్చింది. ఇక కాంగ్రెస్ మోసపూరిత హామీలను ఎండగడుతుంటే మంచి స్పందన లభించింది. రైతు బంధు అందరికీ వచ్చిందా, రుణమాఫీ చేసిండా? అంటే.. లేదు.. లేదు.. అని అరుపులు పెట్టారు. ప్రజల పక్షాన కొట్లాడే పంచు ఎవరంటే... కేసీఆర్.. కేసీఆర్ అంటూ జనం చప్పట్లతో సమ్మతి తెలిపారు. క్యామ మల్లేశ్‌ను గెలిపించి బీఆర్ఎస్‌కు బలమియ్యాలని కోరగా హర్షధ్వానాలు వెల్లువెత్తాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లా పరిధిలోని నల్లగొండ, భువనగిరి లోక్‌సభ స్థానాల్లో జరిగిన రెండు రోజుల బస్సు యాత్ర బీఆర్ఎస్ శ్రేణుల్లో ఫుల్ జోష్‌ను నింపింది.



మాజీ సీఎం కేసీఆర్‌తో రైతు ధరావత్ నర్సింహ

### రైతు నర్సింహకు కేసీఆర్ భరోసా

- **ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ అధినేత**

సూర్యాపేట రూరల్, ఏప్రిల్ 25 : కాళేశ్వరం నీళ్లు రాకపోవడంతో ఎండిన పంట చేనులో పండుకొని రోదించిన రైతు ధరావత్ నర్సింహకు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ధైర్యం చెప్పారు. బుధవారం రాత్రి రోడ్‌షో అనంతరం సూర్యాపేటలో బసచేసిన కేసీఆర్ సూర్యాపేట మండలం దుబ్బతండాకు చెందిన ధరావత్ నర్సింహను పిలుపించుకొని మాట్లాడారు. దగ్గరకు తీసుకొని ఓదార్చారు. ఆయనతో ఫొటో దిగి ఆత్మస్థైర్యం నింపారు. ఎన్ని ఎకరాల భూమి ఉంది? ఏం పంటలు వేశావు.. అని కేసీఆర్ అడిగారు. నర్సింహ స్పందిస్తూ.. 'సార్ నాకు అరెకరం భూమి ఉంది. మీరు సీఎంగా ఉన్నప్పుడు ఇచ్చిన కాళేశ్వరం నీళ్లతో నా భూమితోపాటు ఇంకో నాలుగున్నర ఎకరాలను కౌలుకు తీసుకొని వరి పెట్టాను. ఇప్పుడు కాంగ్రెస్ పాలనలో నీళ్లు ఇవ్వడం లేదు. దాంతో పొట్ట మీద ఐదెకరాల పంట ఎండిపోయింది' అని ఆవేదన వ్యక్తం చేశాడు. కేసీఆర్ స్పందిస్తూ..ఇవన్నీ కాంగ్రెస్ ప్రభుత్వం సృష్టించిన సమస్యలని, రైతులందరి సహకారంతో సర్కారుపై పోరాటం చేద్దామని చెప్పారు. 'తెలంగాణ రాష్ట్రం సాధించిన మనకు ఈ కాంగ్రెస్ ప్రభుత్వం ఓ లెక్కనా.. రైతులందరూ ధైర్యంగా ఉండాలి. మళ్లీ మనమే వస్తాం.. కాళేశ్వరం నీళ్లు తెచ్చుకుందాం. ధైర్యం కోల్పోవద్దు' అని అభయమిచ్చారు.

#### కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం ఆగమైతాంది



"కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో తెలంగాణ రాష్ట్రం పూర్తిగా ఆగమైతాంది. సాగు, తాగు నీళ్లు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నరు. ఏ పథకం సక్కగ ఇస్తలేరు. ప్రజలంతా ఉక్కిరి బిక్కిరి అవుతున్నరు. మళ్లీ కేసీఆర్ సారే రావాలని ప్రజలంతా కోరుకుంటున్నరు. అందుకే ఆయన బస్సు యాత్రకు ప్రజలు వేలాదిగా వస్తున్నరు. జనాలంతా ఆయనకే మద్దతు తెలుపుతున్నరు. రానున్న రోజుల్లో బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి రావడం ఖాయం.

-గునగంటి సైదులుగౌడ్, మాసాయిపేట, యాదగిరిగుట్ట మండలం

#### కేసీఆర్ సారు దేవుడసోంటోడు



"కేసీఆర్ సారు దేవుడసోంటోడు. ప్రజలను సొంత బిడ్డల్లెక్క చూసుకుండు. అనేక పథకాలను ఇచ్చి మాలాంటి పేదోళ్ల గుండెల్లో నిలిచిపోయిండు. కాంగ్రెస్ మాయమాటలను నమ్మి ప్రజలు ఓటేసినందుకు గిప్పుడు బాధ పడుతున్నరు. గిప్పుడు ప్రభుత్వం నుంచి పేదలకు ఏం వస్తలేదు. నీళ్లు, కరెంటు సరిగ ఇస్తలేరు. పింఛన్లు పెంచలేదు. కేసీఆర్ సారు ఉన్నప్పుడే బాగుండె. మళ్లీ ఆయనే రావాలి.

-రేగు గౌరమ్మ, వీరవెల్లి, భువనగిరి మండలం

# తిరిగొచ్చిన మెరుపు కేసీఆర్

## ప్రజల ముందుకు మునుపటి కేసీఆర్

**మళ్లీ కనిపించిన ఉద్యమనాయకుడు.. కష్టాలు చెప్పకుని కన్నీరు కార్చిన రైతన్న**

**తమ బతుకులు మళ్లీ గాడిన పడతాయని ఆశ.. అన్నదాతలో భరోసా నింపిన బీఆర్ఎస్ అధినేత**



హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): గండాల సుడిగుండాల నుంచి తెలంగాణను అవలీలగా దాటించిన నేర్పరి.. చిక్కుముడులను తెంపిన తీర్పరి.. మాటలను దట్టించే మందుగుండు. తెలంగాణను చక్కదిద్దిన నైపుణ్యశీలి. ఆయన మరెవరో కాదు.. తెలంగాణ స్వప్నికుడు.. సాధకుడు కేసీఆర్. కాలు బయటపెట్టిన రెండు రోజులకే తెలంగాణ తిరిగి ఉద్యమ కేసీఆర్‌ను కండ్లారా చూస్తున్నది. తెగుడుతున్న నాల్కలకు ఆయన మాటలు విచ్చుకత్తులవుతున్నయ్. కేసీఆర్ మాటల తూటాలకు ప్రత్యర్థుల్లో వణుకు మొదలైతే, తెలంగాణ మళ్లీ మునుపటి కేసీఆర్‌ను దగ్గర్నుంచి చూస్తున్నది. కేసీఆర్ బస్సుయాత్ర మరో చరిత్రకు సాక్షీభూతం కానున్నది. బస్సుయాత్రతో రెండు రోజుల్లో మిర్యాలగూడ, సూర్యాపేట, భువనగిరిలో ప్రసంగిన కేసీఆర్ తనలో ఉద్యమం నాటి వాడివేడి ఇంకా మిగిలే ఉందని, తాను రంగంలోకి దిగితే విరుచుకుపడుతున్న విపక్షాలు ముడుచుకోవలసిందేనని నిరూపించారు. ఉద్యమనేతగా కేసీఆర్ 2003 ఆగస్టు 25 నుంచి ఆగస్టు 30 వరకు కోదాడ నుంచి హాలియా వరకు చేపట్టిన పాదయాత్రను తాజా బస్సుయాత్ర గుర్తుకు తెచ్చింది. నాడు పిడికిలెత్తి తమ వెంట నడిచిన కేసీఆర్‌కు రైతులు జేజేలు పలుకుతున్నరు. కేసీఆర్ పాలనను గుర్తుకు తెచ్చుకుని సంబరపడుతున్నరు. పదేండ్లలో రెండేసి పంటలు ఎలా పడించుకోగలిగామో, ఇప్పుడు తొలిపంటకే ఎలాంటి కష్టాలు పడుతున్నామో గుర్తుచేసుకుని ఆవేదన చెందుతున్నారు. రెండు దశాబ్దాల క్రితం కేసీఆర్ పాదయాత్ర చేసిన తర్వాత తమ బతుకులు బాగుపడ్డట్టుగానే.. కళతప్పిన తమ బతుకులు ఇప్పుడు మళ్లీ కేసీఆర్ బస్సు యాత్రతో గాడినపడతాయని ఆశగా ఉన్నారు.

**కేసీఆర్ బస్సు యాత్ర**

**రెండోరోజు డైరీ**

#### రైతులకే ఎక్కువ సమయం

బుధవారం హైదరాబాద్ నుంచి బయల్దేరిన కేసీఆర్ ఉమ్మడి నల్లగొండ జిల్లాలోకి ప్రవేశించింది మొదలు రైతులతో మాట్లాడేందుకే ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చారు. అన్నేపర్తి, అర్జాలబావి, మిర్యాలగూడ, తిప్పర్తి, సూర్యాపేట, తిరుమలగిరి, అర్వపల్లి, భువనగిరి ఇలా ఎక్కడికి వెళ్లినా రైతుల ఎజెండాగానే మాట్లాడారు. రైతులను దగ్గరకు పిలిపించుకొని మాట్లాడారు. ప్రభుత్వ పనితీరు, అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న నేతలు, కార్యకర్తలతో మాట్లాడి స్థానిక పరిస్థితులు తెలుసుకున్నారు. బుధవారం రాత్రి సూర్యాపేట చేరుకున్న కేసీఆర్ అక్కడ మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి నివాసంలో బసచేసిన కేసీఆర్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గ్యాదరి కిషోర్, భగత్, రవీంద్రనాయక్, నల్లమోతు భాస్కర్‌రావు తదితరులతో సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలో పార్టీ పరిస్థితి, అనుసరించాల్సిన వ్యూహంపై వారికి దిశానిర్దేశం చేశారు. భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్ , జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పైళ్ల శేఖర్‌రెడ్డి తదితరులతో రోడ్ షో ఏర్పాట్ల గురించి చర్చించారు. అనంతరం సూర్యాపేట జిల్లాకు చెందిన పార్టీ నేతలు, కార్యకర్తలతో ముచ్చటించారు. వారితో కలిసి ఫొటోలు దిగారు. ఆ తరువాత జనగామ జిల్లా మీదుగా భువనగిరికి పయనమయ్యారు. పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పులలో మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు.. కేసీఆర్‌కు అపూర్వ స్వాగత ఏర్పాట్లు చేశారు. జనగామ పొలిమేరలో కేసీఆర్‌కు స్వాగతం పలికిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆయనతో కలిసి బస్సుయాత్రలో పాల్గొన్నారు. హైదరాబాద్–వరంగల్ హైవేపై ఉన్న వివేరా హోటల్‌లో చాయ్ తాగారు. ఆ తర్వాత పార్టీ అభ్యర్థి క్యామ మల్లేశం, పైలా శేఖర్‌రెడ్డితో కలిసి భువనగరి రోడ్‌షోలో పాల్గొన్నారు. తొలిరోజు కాంగ్రెస్, బీజేపీని సున్నితంగా హెచ్చరించి వదిలిపెట్టిన కేసీఆర్.. రెండోరోజు విరుచుకుపడ్డారు.

#### ప్రభుత్వంపై ఆక్రోశం

కేసీఆర్ బస్సుయాత్ర సందర్భంగా రోడ్లపై ఎక్కడ చూసినా రైతులే. తమ మొర ఆలకించాలంటూ కేసీఆర్‌ను కలిసి తమ కష్టాలు వెళ్లబోసుకోవడం రాష్ట్రం పరిస్థితికి అద్దం పడుతున్నది. కల్లాల వద్ద ధాన్యం కుప్పలను చూపించి కొందరు, రైతుబంధు రాలేదని మరికొందరు తమ గోడు వెళ్లబోసుకున్నారు. కాల్వల్లో నీళ్లు మాయమయ్యాయని కొందరు.. కొన్న పంటకు డబ్బులు ఇవ్వడం లేదని ఇంకొందరు తమ కష్టాలను కన్నీళ్ల రూపంలో బయటపెట్టారు.

# కేసీఆర్‌తో చర్చించే స్థాయా నీది?

- **తెలంగాణకు నువ్వు చేసిందేమిటి?**
- **నీ అవగాహన, అనుభవం ఎంత?**
- **ఎంపీ సీట్లలో సామాజిక న్యాయం ఏదీ?**
- **సామాజిక న్యాయం పాటించింది బీఆర్ఎస్సే**
- **రేవంత్‌రెడ్డిపై పొన్నాల లక్ష్మయ్య ఫైర్**



హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరంపై చర్చకు రావాలని కేసీఆర్‌కు సవాల్ విసిరే స్థాయి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఉన్నదా? అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య ఎద్దేవా చేశారు. తెలంగాణకు రేవంత్‌రెడ్డి చేసిందేమిటి? తెలంగాణ సాధన, అభివృద్ధి, సమస్యల పరిష్కారంలో రేవంత్‌రెడ్డి పాత్ర, అనుభవం, అవగాహన ఎంత? అని ప్రశ్నించారు. తెలంగాణ సాధన, అభివృద్ధిలో కేసీఆర్ పాత్ర ఏనాడూ మరువలేనిదని స్పష్టంచేశారు. తాము కూడా సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ఖర్గేను చర్చకు రావాలని సవాల్ విసరగలుగుతామని పేర్కొన్నారు. గురువారం ఆయన తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి వాడుతున్న భాషపై అభ్యంతరం వ్యక్తంచేశారు. 120 రోజుల పరిపాలనపై, హామీల అమలుపై ఎందుకు మాట్లాడటంలేదని నిలదీశారు. చర్చలనేవి వాస్తవాలు తెలుసుకోవడానికి, సమస్యల పరిష్కారానికి అనువుగా ఉండాలని, రాజకీయ ఆధిపత్యం, ఓట్ల కోసం ఉండొద్దని హితవు చెప్పారు. తెలంగాణ ఏర్పాటు తరువాత రాష్ట్రంలో సోలార్ విద్యుత్తు ఉత్పత్తిని ప్రోత్సహించడానికి ప్రభుత్వం అనేక రాయితీలు ఇచ్చిందని చెప్పారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ధాన్యం కొనుగోలు కేంద్రాల విషయంలో చెప్తున్న లెక్కలన్నీ తప్పు అని స్పష్టం చేశారు. కొన్ని జిల్లాల్లో ఇంకా వరి కోతలు ప్రారంభంకాలేదంటూ ప్రభుత్వ నివేదికలు వెల్లడిస్తుంటే, అన్ని కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్టు ఉత్తమ్ చెప్పుకోవడం విడ్డూరమని పేర్కొన్నారు. కొనుగోలు కేంద్రాల సంఖ్యకు అనుగుణంగా ధాన్యం లెక్కలు ఎందుకు లేవని ప్రశ్నించారు. నాగార్జునసాగర్ టెయిల్‌పాండ్ నుంచి ఏపీ నీళ్లు తీసుకొనిపోతుంటే నోరుమెదపని అసమర్థ మంత్రి ఉత్తమ్ అని మండిపడ్డారు.

#### సామాజిక న్యాయం ఏదీ?

కాంగ్రెస్ పార్టీ ఎంపీ టికెట్ల కేటాయింపులో సామాజికవర్గాలకు తీవ్ర అన్యాయం చేసిందని పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. మాదిగలకు ఒక్క టికెట్ కూడా ఇవ్వలేదని, బీసీలకు మూడు మాత్రమే ఇచ్చారని దుయ్యబట్టారు. బీఆర్ఎస్ మాత్రం బీసీలకు ఆరు సీట్లు ఇచ్చిందని గుర్తుచేశారు. 2014, 2018, 2023, 2024 ఎన్నికల్లో బీఆర్ఎస్ ఇచ్చిన సీట్లలో సామాజిక న్యాయం, కాంగ్రెస్ ఇచ్చిన సీట్లతో సామాజిక న్యాయాన్ని పరిశీలించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గతంలోనూ కాంగ్రెస్ వెనకబడిన వర్గాలకు అన్యాయం చేసిందని మండిపడ్డారు.

# మైనార్టీల హామీల అమలుపై తేదీలను ప్రకటిస్తావా?

- **రేవంత్‌కు బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి సవాల్**

హైదరాబాద్, ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ): మైనార్టీలకు ఇచ్చిన హామీల అమలుపై తేదీని ప్రకటించే దమ్ము సీఎం రేవంత్‌రెడ్డికి ఉన్నదా? అని బీఆర్ఎస్ నేత రావుల శ్రీధర్‌రెడ్డి సవాల్ విసిరారు. ఎన్నికలకు ముందు మైనార్టీ డిక్లరేషన్ పేరుతో 13 హామీలను ఇచ్చారని, వాటిలో ఒక్క దాన్నీ ఇంత వరకు అమలు చేయలేదని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు కొండంత.. అమలు గోరంత అని ఎద్దేవా చేశారు. గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడిన ఆయన.. అన్ని వర్గాలను మోసం చేసిన చరిత్ర కాంగ్రెస్‌దేనని మండిపడ్డారు. రేవంత్ మంత్రివర్గంలో మైనార్టీ వర్గానికి చెందినవ్యక్తి ఒక్కరూ లేరని తెలిపారు. జనాభా లెక్కలను పరిగణనలోకి తీసుకొని రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి, ఇంతవరకు వాటి ఊసే ఎత్తలేదని విమర్శించారు. మైనార్టీల బడ్జెట్‌ను రూ.4వేల కోట్లకు పెంచుతామని, చెప్పి అమలు చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌వి ఓటు బ్యాంకు రాజకీయాలు తప్ప, ఏనాడూ ముస్లింలపై చిత్తశుద్ధి చూపలేదని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఒక్క ముస్లిం కుటుంబమైనా బాగుపడిందా? అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని మైనార్టీలకు పిలుపునిచ్చారు. బీఆర్ఎస్‌కు అండగా నిలవాలని విన్నవించారు.


